ఆరు ప్రమాదాల్లో 8మంది మృత్యువాత

విద్యుదాఘాతంతో ఇద్దరు

చిల్లకూరు, జనవరి 2:చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వీరేంద్రకుమార్(24), ముఖేష్‌కుమార్ టిప్పర్ డ్రైవర్లుగా, మనీష్‌కుమార్(23) క్లీనర్‌గా చింతవరంలో పనిచేస్తున్నారు. మంగళవారం చింతవరం సమీపంలోని వేబ్రిడ్జి వద్ద టిప్పర్‌కు గ్రీస్ పెడుతున్నారు. ఈ క్రమంలో ముఖేష్‌కుమార్ టిప్పర్ హైడ్రాలిక్ లిఫ్టును పైకి లేపుతుండగా ట్రక్కు 11కేవీ విద్యుత్ తీగలకు తగడంతో గ్రీస్ పెడుతున్న వీరేంద్రకుమార్, మనీష్‌కుమార్ విద్యుతాఘాతానికి లోనై మృతిచెందారు. ముఖేష్‌కుమార్‌కు గాయాలయ్యాయి. అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



1



2

1. వీరేంద్రకుమార్(ఫైల్‌ఫొటో)
2. మనీష్‌కుమార్(ఫైల్‌ఫొటో)



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి

టీ దుకాణంపైకి దూసుకెళ్లిన ఇన్నోవా

- ఇద్దరి మృతి
- ముగ్గురికి గాయాలు



హరి,మురళీనాయుడు (ఫైల్‌ఫొటోలు)

ఏర్పేడు, జనవరి 2: టీ దుకాణంపై కారు దూసుకెళ్లిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ముగ్గురికి గాయాలైన ఘటన ఏర్పేడు మండలంలో చోటుచేసుకుంది.ఎస్‌ఐ జిలానీ కథనం మేరకు.... తిరుపతికి చెందిన సుధాకర్ తన స్నేహితుడితో కలిసి ఇన్నోవా వాహనంలో వెంకటగిరికి మంగళవారం ఉదయం వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఏర్పేడు మండలం చింతలపాళెం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద అతివేగంతో ఇన్నోవా అదుపు తప్పింది. ఎదురుగా ఉన్న టీ దుకాణం ముందున్న వేపచెట్టును ఢీకొని అనంతరం అక్కడ టీ తాగుతున్న వ్యక్తులపైకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో టీ తాగడానికి వచ్చిన చింతలపాళెం గ్రామానికి చెందిన మురళీనాయుడు(50) అక్కడికక్కడే మృతి చెందగా చింతలపాళెం దళితవాడకు చెందిన హరి(57) తీవ్రంగా గాయపడ్డాడు.తిరుపతికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.అక్కడే టీ తాగుతున్న బీట్ ఆఫీసర్ హైమావతి తీవ్రంగా గాయపడగా ఇన్నోవా డ్రైవర్ సుధాకర్,అతడి స్నేహితుడు కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. మురళీ నాయుడు, మణి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతూ ఒకరు



జగన్నాథరెడ్డి (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జనవరి 2:చంద్రగిరి- తొండవాడ మార్గమధ్యంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసుల కథనం మేరకు... చంద్రగిరి మండలంలోని కొత్తశానంబట్లలో సోమవారం జల్లికట్టు జరిగింది. జల్లికట్టు ప్రశాంతంగా జరిగిన నేపథ్యంలో మంగళవారం గ్రామస్తులు కొంత మంది తొండవాడ సమీపంలోని డాబాకు వచ్చి భోంచేశారు. తిరిగి ఇంటికి వెళ్లడానికి సర్వీసు రోడ్డు దాటుతుండగా వారిలో ఒకరైన జగన్నాథరెడ్డి(52)ని తిరుపతి వైపు వెళ్ళే టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది.ఈ ప్రమాదంలో జగన్నాథరెడ్డి మృతదేహం రెండు ముక్కలుగా విడిపోయింది.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సర్వీసు రోడ్డు కాలువలో నాగరాజు మృతదేహం

టూవీలర్ ప్రమాదంలో ఒకరు

చంద్రగిరి, జనవరి 2: చంద్రగిరి మండల పరిధిలోని సి.మల్లవరం జంక్షన్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం హరిజనవాడకు చెందిన నాగరాజు(60) ఎస్‌బీఐలో ఏజెంటు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తొండవాడకు వచ్చాడు. రాత్రి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం సి.మల్లవరం సమీపంలోని సర్వీసు రోడ్డు కాలువలో తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు.పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.నాగరాజును వాహనం ఢీకొందా, లేక ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాలువలో పడి చనిపోయాడా అనేది విచారణలో తెలియాల్సి ఉంది.

బైక్ అదుపుతప్పి యువకుడు

తడ, జనవరి 2 : బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సూళ్లూరుపేట పట్టణం వట్రపాళెం గ్రామానికి చెందిన తమిళ సెల్వం (28) సోమవారం సాయంత్రం తన స్నేహితుడి బైక్‌పై రామాపురం వచ్చాడు. అక్కడ పనిచూసుకొని అర్ధరాత్రి తిరుగుప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని రామాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుడికి వెళ్లొస్తూ మహిళ

నారాయణవనం, జనవరి 2:నారాయణవనంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... కీళగరం గ్రామానికి చెందిన శకుంతల(51) సోమవారం రాత్రి స్థానికంగా ఉన్న ఆలయ దర్శనం చేసుకుని ఇంటికి బయల్దేరింది.వడమాలపేట మండలం కాయంపేటకు చెందిన మునస్వామి మోటార్ సైకిల్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న శకుంతలను కళింమిట్ట క్రాస్ వద్ద ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శకుంతల తలకు తీవ్ర గాయాలైంది. స్థానికులు గుర్తించి పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి... అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం తిరుపతి రుయాకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ వైపు ఇద్దరు సిటింగుల చూపు!

- అవమానించిన అధినేతకు తగిన బుద్ధి చెప్పేందుకు రగిలిపోతున్న వైనం

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు సిటింగు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. అధికార పార్టీలో తమకు జరుగుతున్న అవమానానికి రగిలిపోతున్న ఆ ఇద్దరూ ప్రతీకారం తీర్చుకునేలా అధినేతకు తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ దిశగా పయనించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటూ సమాయత్తమవుతున్నట్టు వారి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో ప్రాభవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి తిరిగి ప్రాణం పోయడంలో వీరిదే తొలి అడుగు కానుంది.

జిల్లాలో చెరో దిశగా వున్న రెండు నియోజకవర్గాల సిటింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో తిరిగి టికెట్ ఇవ్వడం లేదని అధినేత జగన్ స్పష్టత ఇచ్చేసినట్టు ఆయా నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తూర్పు దిశగా వున్న నియోజకవర్గ ఎమ్మెల్యే అధికార పార్టీలో ఆవిర్భావం నుంచీ వున్నారు. ఒకసారి ఓటమి చెందినా ఓపిగ్గా పార్టీలో కొనసాగారు. నిత్యం ప్రజల్లో వుంటూ రెండవ పర్యాయం కిందటి ఎన్నికల్లో గెలుపొందారు. స్వతహాగా సౌమ్యుడని పేరుంది. కుటుంబసభ్యులొకరి తీరుతో పలువురు పార్టీ నాయకులు నొచ్చుకున్న మాట వాస్తవం. దానిపై ఫిర్యాదులు రావడంతో ఆ కుటుంబ సభ్యుల జోక్యం దాదాపుగా తగ్గించేశారు. ఏవో గ్రామస్థాయి నిర్ణయాలు, అభివృద్ధి పనుల్లో మినహా ఆయన నిర్ణయాలేవీ చెల్లుబాటు కాలేదు. జిల్లాపై పెత్తనం చెలాయిస్తున్న ఓ మంత్రి నిర్ణయించిన మేరకే పదవులు సహా అధికారుల బదిలీలు వంటివి జరిగాయి. అయినా ఎన్నికలు సమీపించేసరికి సర్వేల్లో రిపోర్టులు బాగా రాలేదని, పార్టీ నాయకుల్లో వ్యతిరేకత వుందన్న కారణాలు చూపి టికెట్ తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ఉమ్మడి జిల్లా కేంద్రానికి చేరువగా వున్న నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యేది మరో దీన గాథ. ఆయన కూడా పార్టీలో ఆవిర్భావం నుంచీ వున్నారు. జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దక్కింది.పారిశ్రామికవేత్త నేపథ్యం వుండడంతో సొంత ఆర్థిక వనరులు ఖర్చు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేశారు. పోలింగ్ రోజు టీడీపీ కంచుకోట వంటి ఓ గ్రామంలో పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఏకపక్ష ఓటింగ్ జరుగుతోందంటూ గొడవ చేశారు. ఆ క్రమంలో బ్యాలెట్ బాక్సులో నీరు పోసేశారు. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆరోగ్యం విషమించిన పరిస్థితుల్లో రోజుల తరబడీ ఆస్పత్రి పాలై నెమ్మదిగా కోలుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక కూడా జిల్లాలో ఆధిపత్యం వహిస్తున్న ఓ మంత్రి ఇష్టాయిష్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా పార్టీ నిధులపై ఆధారపడకుండా సొంత నిధులు వెచ్చించేందుకు సంసిద్ధమయ్యారు. అయినా ఏవో కారణాలు చూపి అధినేత టికెట్ నిరాకరించినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ ఎమ్మెల్యేకి పరిశ్రమలు, వ్యాపారాలపరంగా బెంగుళూరుతో సంబంధాలున్నాయి. అందులో భాగంగా అక్కడి రాజకీయ పార్టీల ముఖ్యనేతలతో సన్నిహిత పరిచయాలు పెంచుకున్నారు. ఇటీవల వచ్చిన పర్వదినాన కర్ణాటకలో కీలక పదవిలో వున్న కాంగ్రెస్ ముఖ్యనేత కుటుంబీకులను తిరుమలకు దర్శనానికి వెంట తీసుకెళ్ళినట్టు సమాచారం. టికెట్ విషయంలో అధినేత వ్యవహారశైలితో తీవ్ర అవమానానికి, మానసిక వేదనకు గురవుతున్నందున అధినేతకు కూడా అదేవిధమైన గుణపాఠం చెప్పాలని కర్ణాటక నేత ద్వారా కాంగ్రెస్‌లో చేరేందుకు సంసిద్ధమవుతున్నట్టు సమాచారం. తొలుత ప్రస్తావించిన సిటింగ్ కూడా ఇదే తీరులో ఆలోచిస్తూ కాంగ్రెస్‌కు చేరువయ్యేందుకు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. వీరిని అధిష్ఠానం బుజ్జగించకపోయినా, లేక టికెట్లు ఖరారు చేయకపోయినా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ కాంగ్రెస్‌లో చేరబోయే తొలి నేతలు వీరే కావడానికి అవకాశాలున్నాయి.

ఆ ఇద్దరికీ లైన్‌క్లియర్

- తిరుపతి, చంద్రగిరి వైసీపీ సమన్వయకర్తలుగా అభినయ్, మోహిత్
- మిగిలిన సెగ్మెంట్లలో మార్పుచేర్పులకు అవకాశం? -పార్టీ ప్రకటనతో ఇతర సెగ్మెంట్ల నేతల గుండెల్లో రైళ్ళు





తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు వైసీపీ అధిష్ఠానం సమన్వయకర్తలను ప్రకటించింది. మంగళవారం రాత్రి విడుదల చేసిన జాబితాలో తిరుపతికి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని, చంద్రగిరికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని సమన్వయకర్తలుగా పేర్కొంది. కాకపోతే ఇదేమీ కొత్త విషయం కాకపోవడంతో అధికార పార్టీ ప్రకటన జిల్లాలో పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే అదే సమయంలో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు ఎమ్మెల్యేల అనుచరవర్గాల్లో దడ మొదలైంది. తొలి జాబితాలో కేవలం తిరుపతి, చంద్రగిరి మాత్రమే చోటుచేసుకోవడంతో మిగిలిన చోట్ల మార్పుచేర్పులు తప్పవన్న సంకేతం వెలుడడంతో ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి 2019లో కొత్త మంత్రివర్గం ఏర్పాటైన వెంటనే తాను తదుపరి ఎన్నికల్లో పోటీ చేయబోవడం లేదని, ప్రత్యక్ష పోటీ రాజకీయాలకు దూరంగా వుంటానని ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచే రానున్న ఎన్నికల్లో ఆయన వారసుడిగా కుమారుడు అభినయ్ రెడ్డి బరిలో వుంటారని పార్టీ వర్గాలతో పాటు సామాన్య జనం కూడా భావిస్తున్నారు. గతేడాది తిరుపతిలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూడా అభినయ్‌రెడ్డిని గెలిపించాలని శ్రేణులను కోరారు. దీంతో తదుపరి ఎన్నికల్లో తిరుపతి నుంచీ వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి అన్నదాంట్లో ఎవరికీ ఎటువంటి అనుమానాలు లేకుండాపోయాయి. ఇక చంద్రగిరి వైసీపీ అభ్యర్థిత్వంపై మరింత స్పష్టత మొదటి నుంచే వుంది. గతేడాదిలోనే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్థానంలో వచ్చే ఎన్నికలకు ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి అభ్యర్థిగా వుంటారని పార్టీ ప్రకటించింది. మోహిత్‌కు గన్‌మెన్ సదుపాయం కూడా కల్పించింది. అధికారిక ప్రోటోకాల్ కోసం భాస్కర్‌రెడ్డి తుడా ఛైర్మన్ పదవి నుంచీ తప్పుకోవడంతో ఆ స్థానంలో మోహిత్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తిరుపతిలో విజయసాయిరెడ్డి సమీక్షా సమావేశం జరిపినపుడు ఇదే విషయాన్ని స్పష్టం చేయగా తర్వాత మోహిత్‌ను చంద్రగిరి వైసీపీ శ్రేణులకు పరిచయం చేసేందుకు భారీఎత్తున నిర్వహించిన ఆత్మీయ సదస్సులో కూడా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ మిథున్ తదితర కీలక నేతలంతా మోహిత్ అభ్యర్థిత్వంపై స్పష్టత ఇచ్చి గెలిపించాలని శ్రేణులకు పిలుపు ఇచ్చిన సంగతి తెలియంది కాదు. దీంతో మంగళవారం పార్టీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ఈ రెండు నియోజకవర్గాల్లో గానీ, జిల్లావ్యాప్తంగా గానీ ఎలాంటి ఆశ్చర్యం, సంచలనం కలిగించలేదు. దీనిపై పెద్దగా చర్చ కూడా లేదు.అయితే మిగిలిన నియోజకవర్గాల ప్రస్తావన జాబితాలో లేకపోవడం జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. సమన్వయకర్తలుగా ప్రకటించడమంటే ఆయా చోట్ల వారే రానున్న ఎన్నికల్లో అభ్యర్థులన్నది తెలిసిందే. దీంతో సత్యవేడు, సూళ్ళూరుపేట, గూడూరు వంటి రిజర్వుడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మారుస్తారంటూ జరుగుతున్న ప్రచారానికి జాబితా బలం చేకూరుస్తోంది. ఈ విషయం పక్కన పెడితే టికెట్ విషయంలో మార్పులుండవని, తమకు ఢోకా లేదని భావిస్తున్న నగరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేల విషయంలో కూడా పార్టీ పునరాలోచనలో వుందన్న సంకేతాలను తాజా జాబితా ఇచ్చింది. అలాగే ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇతర నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కాకపోతే మార్పులుంటేనే కొత్తగా సమన్వయకర్తలను నియమిస్తారని, తమ నియోజకవర్గాల్లో మార్పులు లేవు కాబట్టి సమన్వయకర్తలను నియమించే ప్రసక్తి లేదని, అందువల్లే జాబితాలో ఆ ప్రస్తావన లేదని సిట్టింగులు తమ అనుచరవర్గాల ఎదుట బింకం ప్రదర్శిస్తున్నట్టు సమాచారం.

జనసేన నేత పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి

- కిరణ్ రాయల్ కేసులో పోలీసు శాఖను ఆదేశించిన హైకోర్టు
- తదుపరి విచారణ 9కి వాయిదా

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి రోజాను విమర్శించారంటూ జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్‌పై కేసు నమోదు చేసిన నగరి పోలీసులు ఆయనకు సంబంధించిన మొబైల్ ఫోన్ల నుంచీ డేటా చౌర్యానికి పాల్పడ్డారంటూ దాఖలైన రిట్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. దీనిపై వారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే ....తిరుపతి జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్ 2022 అక్టోబరు 16న మీడియా సమావేశంలో మంత్రి రోజాపై విమర్శలు చేశారు. ఇవి అనుచిత విమర్శలంటూ నగరి, పుత్తూరుల్లో వైసీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ఆయనపై అదే నెల 18న కేసు నమోదైంది.నవంబరు 11న ఈ కేసులో నగరి పోలీసులు తిరుపతిలో కిరణ్ రాయల్‌ను ఆయన ఇంటిలో వుండగా అదుపులోకి తీసుకుని నగరికి తరలించి మరుసటి రోజు అక్కడి కోర్టులో హాజరుపరిచారు. కాగా కిరణ్ రాయల్‌ను అదుపులోకి తీసుకున్నపుడు ఆయనకు, ఆయన సతీమణికి చెందిన రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆయన పోలీసు కస్టడీ నుంచీ విడుదలయ్యాక నవంబరు 23న పోలీసుల స్వాధీనంలో వున్న తన మొబైల్ ఫోన్లను తిరిగి అప్పగించాల్సిందిగా కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కోర్టు మొబైల్ ఫోన్ల నుంచీ ఎలాంటి సమాచారం ఇతరులకు లీక్ చేయకూడదంటూ పోలీసులను ఆదేశించింది. కిరణ్ రాయల్ హైకోర్టును ఆశ్రయించడంతో అతనిపై నమోదు చేసిన సెక్షన్ 294 మినహా మిగిలిన సెక్షన్లను కొట్టివేసింది. అదే సమయంలో సాక్ష్యాధారాల కింద తీసుకున్న అతని రెండు మొబైల్ ఫోన్ల నుంచీ మంత్రి రోజా గురించి మాట్లాడిన వీడియో మినహా మరే ఇతర సమాచారం సేకరించరాదని ఆదేశించింది. ఫోన్ల నుంచీ కేసుకు అవసరమైన డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచీ మాత్రమే సేకరించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు నగరి కోర్టు సంబంధిత మొబైళ్లను భద్రపరచాలని,దాని నుంచీ ఎవరూ ఎలాంటి సమాచారం సేకరించకుండా కట్టడి చేయాలని కోర్టులో సంబంధిత ప్రాపర్టీ క్లర్కును ఆదేశించింది. అయితే కోర్టు అనుమతి లేకుండా పోలీసులు మొబైల్ ఫోన్లను తీసుకెళ్ళినట్టు తేలడంతో కలకలం రేగింది.ఈ నేపథ్యంలో కిరణ్ రాయల్ తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. తన ఫోన్ల నుంచీ పోలీసులు డేటా చౌర్యానికి పాల్పడ్డారని, అందులోని ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నారంటూ తన రిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజా సమస్యలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నేతల ఫోన్ల నుంచీ డేటా దొంగలించడం గోప్యతా హక్కును హరించడమేనని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన హైకోర్టును కోరుతూ గత నెల 27వ తేదీన రిట్ పిటిషన్ దాఖలు చేయగా 29వ తేదీన పిటిషన్ రిజిస్టరై (రిట్ పిటిషన్ నంబరు 33578-2023) మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జడ్జి జస్టిస్ భానుమతి వారంలోగా కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగరి డీఎస్పీ రవికుమార్, నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, మునుపటి నగరి సీఐ, ప్రస్తుత నింద్ర సీఐ శ్రీనివాసంతి, నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్‌లను కిరణ్ రాయల్ ప్రతివాదులుగా పేర్కొన్నారు. కాగా కిరణ్ రాయల్ తరపున న్యాయవాది పి.వి.జి.ఉమేష్ చంద్ర కేసు వాదిస్తున్నారు.

గత ఏడాది ఆర్టీసీ ఆదాయం రూ.595కోట్లు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 2: గత ఏడాదిలో ఆర్టీసీకి జిల్లాలో రికార్డు స్థాయిలో రూ.595కోట్ల ఆదాయం లభించింది. ఇందులో తిరుపతి-తిరుమల మార్గం ద్వారానే దాదాపు రూ. 300కోట్లు రావడం విశేషం. జిల్లా పరిధిలో 11డిపోలుండగా సొంత, అద్దె కలిపి 947 బస్సులున్నాయి. ఇవి 1,219 లక్షల కిలోమీటర్లు తిరగ్గా, ఈపీకే రూ.50, ఆక్యుపెన్సీ రేషియో 69శాతం నమోదైంది. శాశ్వత, పొరుగుసేవల విభాగాల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించడంతోనే ఆదాయంలో రాష్ట్రంలోనే మొదటి స్థానం కొనసాగుతున్నట్లు ఈడీ చెంగల్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు.

అంగన్‌వాడీ వర్కర్ల వినూత్న నిరసన



చంద్రగిరిలో దున్నపోతుకు వినతిపత్రం

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె మంగళవారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినూత్న రీతిలో ప్రభుత్వానికి నిరసనలు తెలిపారు.తిరుపతి నగరం సహా చంద్రగిరి, పుత్తూరు, సత్యవేడు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి పట్టణాలు, కోట మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. తమ సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం దున్నపోతు చందంగా వ్యవహరిస్తోందన్న అర్థం వచ్చేలా తిరుపతి, చంద్రగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, పుత్తూరు, సత్యవేడు తదితర పట్టణాల్లో ఉద్యోగులు దున్నపోతులకు, బర్రెలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కాగా కోట మండల కేంద్రంలో ఉద్యోగులు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలియజేయగా నాయుడుపేటలో సోది చెప్పి, వెంకటగిరిలో అంబేడ్కర్ చిత్ర పటానికి వినతులు అందజేసి ఉద్యోగులు తమ నిరసనను, అసంతృప్తిని వ్యక్తం చేశారు.


అప్పుడు సునీల్..
ఇప్పుడు ఎంఎస్ బాబు

● వైసీపీలో దళిత ఎమ్మెల్యేలే టార్గెట్

చిత్తూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్యేల్లో తొలి తిరుగుబాటు జెండా ఎగిరింది. అణచిపెట్టుకున్న అవమానం దుఃఖాగ్రహంగా మారి కట్టలు తెంచుకుంది. ఐదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన సేవలన్నీ తాడేపల్లి ప్యాలెస్ తీసుకున్న నిర్ణయం ముందు బదాబదలయ్యాయి. ఐప్యాక్ టీం వేసిన తూకంలో నీళ్ల కన్నా పలచన అయిపోయానంటూ పూతలపట్టు దళిత ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం ప్రకటించిన ఆవేదన ప్రజల్లో చర్చగా మారింది. నా ఎస్టీలు.. నా ఎస్సీలు.. నా బీసీలు.. నా మైనారిటీలు.. అంటూ సభల్లో హోరెత్తే మాటల వెనుక ఉన్నది ఇదా అని దళిత, బీసీ, మైనారిటీ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పూతలపట్టు నుంచి ఎంఎస్ బాబుకు టికెట్ లేదని జగన్‌రెడ్డి తేల్చేయడంతో ఆయన మంగళవారం మీడియా ముందు కడుపుచించుకున్నారు. తన బాధ పంచుకున్నారు. వైసీపీ అధిష్ఠానానికి అనేక ప్రశ్నలు సంధించారు. అయితే 2019 ఎన్నికల సమయంలోనూ పూతలపట్టు విషయంలో జగన్ ఇదే తీరులో నిర్ణయం తీసుకున్న విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. పదవిలో ఉన్నా దళితులకు వైసీపీలో పవర్ ఉండదని అంటున్నారు. మండల స్థాయిలో కూడా ఒక సామాజికవర్గం నాయకులకు అణిగిమణిగి ఉండాల్సి వస్తోందని అంటున్నారు. ఇన్ని భరించినా మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి టికెట్ లేదంటూ తూచ్ అనేయడం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు వైసీపీలోని దళితవర్గాల నుంచి వినిపిస్తోంది.



ఎంత తలొగ్గినా...


సునీల్‌కుమార్

సునీల్‌కుమార్‌కు టికెట్ ఇవ్వకపోవడం వెనుక జిల్లాను తన గుప్పెట్లో పెట్టుకున్న పెద్దనాయకుడి పాత్ర ఉందని అప్పట్లో ప్రచారం జరిగింది. అప్పట్లో సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్ బాబుకు టికెట్ ఇప్పించిన ఆ పెద్దాయనే ఇప్పుడు బాబుకూ ఎసరు పెట్టారని అంటున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఈ ఐదేళ్ల పాటు స్వతంత్రంగా పని చేయలేకపోయారనేది బహిరంగ సత్యం. ప్రతి విషయంలోనూ పార్టీ పెద్దలు, మంత్రులు జోక్యం చేసుకునేవారు. ఆయన కూడా ధిక్కారంగా ఎన్నడూ వ్యవహరించేవారు కాదు. యాదమరి, తవణంపల్లె, బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు మండలాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులే పెత్తనం చెలాయించారు. వార్డు మెంబర్ నుంచి జడ్పీటీసీ వరకు ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా తాము సూచించిన వారికి పదవులు దక్కేలా చూసుకున్నారు. ఎమ్మెల్యే వద్దన్నచోట ఇండిపెండెంట్లను రంగంలోకి దింపి గెలిపించుకున్నారు. కాణిపాకం ట్రస్టు బోర్డు ఛైర్మన్, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంటి పదవుల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే ఉన్నారు. బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ జడ్పీటీసీ మనోహర్ భార్య సెల్వికి ఎమ్మెల్యే సిఫార్సు చేసినా, పట్టించుకోని అధిష్ఠానం పరమేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. ఐరాల మండలంలో ఓ ఎంపీటీసీ స్థానానికి ఎమ్మెల్యే బీఫాం ఇచ్చిన వ్యక్తిని కాదని అక్కడ కూడా ఇండిపెండెంట్ అభ్యర్థిని నిలబెట్టి రూ.లక్షలు ఖర్చు పెట్టి గెలిపించుకున్నారు. యాదమరిలో ఓ తహసీల్దార్‌ను ఎమ్మెల్యే బదిలీ చేయిస్తే, మండలంలో ప్రాబల్యం ఉన్న ఓ నేత అదే తహసీల్దార్‌ను సాయంత్రానికి తెచ్చుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రతి మండలానికో రెడ్డి నాయకుడు పెత్తనం చెలాయిస్తూ, ఆయా మండలాల్లో ఎమ్మెల్యే మాట చెల్లకుండా డమ్మీగా చిత్రీకరించారు. అయినా ఎన్నికలు వచ్చాక నింద ఎంఎస్ బాబు మీద మోపేసి టికెట్ ఎగ్గొట్టడం విశేషం.

ఎంఎస్ బాబు ఆవేదన

"ఈ ఐదేళ్ల పాటు పార్టీ పెద్దలు, మంత్రులు చెప్పినట్లు నడుచుకున్నా, ఇప్పుడు వ్యతిరేకత ఉందంటే బాధ్యత ఎవరిది? వ్యాపారాలను, కుటుంబాన్ని వదిలేసి కష్టపడితే ఇదా ఫలితం? నేనేం పాపం చేశాను. దళితుడిగా పుట్టడమే వేస్టా?"

"మాటిమాటికి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటారే గానీ, మాకేం న్యాయం చేస్తున్నారు? రెడ్లు చెప్పిందే నేను చేశాను. సీఎం గారూ.. దళితులను మోసం చేయొద్దు."

"చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వ్యతిరేకత ఉన్నా ఓసీలకు మళ్లీ టికెట్లు ఇస్తున్నారు. డబ్బులిస్తే ఇష్టమొచ్చినట్లు ఐప్యాక్ సర్వే ఫలితాలను మారుస్తుంది. మరి వ్యతిరేకత వచ్చిందంటూ దళితులనే మార్చడమేంటో నాకు అర్థం కావడం లేదు."

జగన్ ఇంటి గేటు వద్ద రోజంతా పడిగాపులు కాసినా..


2019 ఎన్నికల సందర్భంగా జగన్ ఇంటి వద్ద వేచి ఉన్న నాటి ఎమ్మెల్యే సునీల్

2014 ఎన్నికల్లో పూతలపట్టు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సునీల్‌కుమార్‌ను 2019 ఎన్నికల సమయంలో వైసీపీ అధిష్ఠానం ఘోరంగా అవమానించింది. పిలిపించి టికెట్ లేదని గౌరవంగా కూడా చెప్పలేదు. అప్పట్లో టికెట్ మళ్లీ తనకే ఇవ్వమంటూ అడిగేందుకు లోటస్‌పాండ్‌లోని జగన్ ఇంటికి వెళ్లిన సునీల్‌కుమార్‌ను కనీసం ఇంట్లోకి కూడా రానివ్వలేదు. జగన్ ఇంటి గేటు వద్ద కుటుంబ సభ్యులతో కలిసి సునీల్‌కుమార్ రోజంతా నిలబడిన ఫొటోలు, వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి.

అసలేం జరిగింది?

2019లో ఎమ్మెల్యేగా గెలిచాక ఇప్పటిదాకా ఒక్కసారి కూడా సీఎం జగన్‌ను నేరుగా కలిసి మాట్లాడే అవకాశం ఎంఎస్ బాబుకు లభించలేదు. కాణిపాకంలో బ్రహోత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రం ఓసారి కొందరితో కలిసి వెళ్లి ఆయన సీఎంని కలిశారు. నియోజకవర్గ పరిస్థితుల్ని చెప్పుకునేందుకు అనేకసార్లు సీఎం అపాయింట్‌మెంట్ కోరినా ఫలితం లేదని ఎంఎస్ బాబు చెప్పారు. విచిత్రం ఏమిటంటే.. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని చెప్పడానికి మాత్రం సీఎంవో నుంచి పిలుపు వచ్చింది. సుమారు వారం కిందట ఎంఎస్ బాబుతో సీఎం జగన్ నేరుగా భేటీ అయ్యారు. 'ఈసారి నీకు టికెట్ ఇవ్వడం కుదరడం లేదు. సర్వేల్లో నీ గురించి వ్యతిరేకంగా వచ్చింది. మనం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తాం' అని చెప్పినట్టు తెలుస్తోంది. అయినా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో సీఎం మనసు మార్చుకోవచ్చని ఆయన నమ్మినట్టు చెబుతున్నారు. అయితే సోమవారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి కూడా ఈసారి టికెట్ లేదనే విషయాన్ని బాబుకు తేల్చి చెప్పేశారని, దీంతో మధనపడ్డ ఆయన మంగళవారం మీడియా ముందు మనసులో ఉన్నదంతా బయటపెట్టేశారని తెలుస్తోంది.



ప్రభుత్వ వైద్యం మరింత చేరువ

చంద్రగిరి, జనవరి 2: ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేయడమే జగనన్న ఆరోగ సురక్ష లక్ష్యమని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. మంగళవారం పనపాకం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్య సురక్ష పరిశీలకురాలు రమాదేవి, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీనాయక్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసరాల గోడౌన్ తనిఖీ

చంద్రగిరి, జనవరి 2: చంద్రగిరి మండలంలో నిత్యావసరాల ప్రజా పంపిణీ కేంద్రాలను, గోడౌన్లను మంగళవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తనిఖీ చేశారు.పౌరసరఫరాల శాఖాధికారి రాజా రఘువీర్, తహసీల్దార్ శిరీష, డీటీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



తిరుచానూరు, జనవరి 2: తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పెరిగిన పింఛన్లను తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. తిరుపతి రూరల్ మండలంలో 658 నూతన పించన్లు మంజూరైనట్లు వివరించారు.

ఆగని అంగన్వాడీల సమ్మె

చంద్రగిరి, జనవరి 2: చంద్రగిరిలో అంగన్వాడీల సమ్మె కొనసాగుతోంది. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన తెలియజేశారు.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, ప్రియ, విజయకుమారి, నాగభూషణమ్మ, లీల, నాగరాజమ్మ, పద్మిని, సుజాత పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, జనవరి 2: చంద్రగిరిలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ ద్వారా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 5వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.వివరాలకు 7989680587, 9494951289, నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పాకాల, జనవరి 2: స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం ఎంఈవో బాబ్జీ చేతుల మీదుగా ఎస్టీయూ వార్షిక క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు.ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పి.ప్రభాకర్, జిల్లా కౌన్సిలర్ ఎ.జార్జి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏనుగుల విధ్వంసం


చంద్రగిరివారిపల్లె పరిసరాల్లో ధ్వంసమైన మామిడితోటలు

పాకాల, జనవరి 2: మండలంలోని చంద్రగిరివారిపల్లె, వల్లివేడు, వరదప్పనాయుడుపేట పరిసరాలలోని పొలాల్లో సోమవారం రాత్రి ఏనుగులు సంచరించాయి. మామిడి తోటలకు ఫెన్సింగ్ కోసం ఏర్పాటు చేసిన రాతి కూసాలు విరగ్గొట్టాయి.మామిడి తోటలు, కొబ్బరిచెట్లు, అరటిచెట్లు ధ్వంసం చేశాయి. పదిపుట్లబైలు పరిసరాల్లో దాడి చేస్తుండిన ఏనుగుల గుంపును తరిమితే తూర్పువైపు వల్లివేడు, చంద్రగిరివారిపల్లె, వరదప్పనాయుడుపేట, ఈపాలగుట్టపల్లె ప్రాంతాల్లోకి వచ్చి ఇక్కడి పొలాలను ధ్వంసం చేస్తున్నాయి.

రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి పరామర్శ


జగన్నాథరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 2: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొత్తశానంబట్ల గ్రామానికి చెందిన జగన్నాథరెడ్డి కుటుంబసభ్యులను టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని పరామర్శించారు. చంద్రగిరి - తొండవాడ మార్గమధ్యంలో టిప్పర్ ఢీకొన్న ఘటనలో జగన్నాథరెడ్డి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న నాని సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆయనవెంట చంద్రగిరి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తులసేశ్వరరెడ్డి, జగన్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వందరోజులు పని కల్పించాలి

భాకరాపేట, జనవరి 2: ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. చిన్నగొట్టిగల్లు మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన పనులకు మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆడిట్ బృందం క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి నివేదికలు అందజేసింది. మండలంలోని 13 పంచాయతీల్లో మామిడి మొక్కల పెంపకం, బౌండరీ ట్రెంచులు, ఫారం పాండులు వంటి 1385 పనులకుగాను రూ.5.39 కోట్లు వ్యయం చేశారు. క్షేత్రస్థాయి పనులలో కొలతలు తక్కువగా ఉండడం, మామిడి మొక్కలు చనిపోవడం, నేమ్ బోర్డులు పెట్టకపోవడం వంటి అక్రమాలు గుర్తించారు. దీనికి సంబంధించి భాకరాపేటలో రూ.42వేలు, చట్టేవారిపాళెంలో రూ.24 వేలు, చిట్టేచెర్లలో రూ.24 వేలు, దేవరకొండలో రూ.78వేలు, కోటబైలులో రూ.83వేలు, నెల్లుట్లవారిపల్లెలో రూ.23 వేలు, దీన్‌దార్లపల్లెలో రూ.7వేలు, ఎగువూరులో రూ.13 వేలు, చిన్నగొట్టిగల్లులో రూ.28 వేలు రైతుల నుంచి రికవరీ చేశారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి సుశీల, ఏపీడీ పద్మలత, అంబుడ్స్‌మన్ రాసారాయుడు, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఏపీవోలు భార్గవి, మృత్యుంజయరావు, ఎస్ఆర్‌పీ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్‌లదే హవా


రుయాస్పత్రిలో మహాప్రస్థానం వాహనాలుండీ ఉపయోగమేమి?

తిరుపతి సిటీ, జనవరి 2: రుయాస్పత్రిలో మృతదేహాలను ఉచితంగా తరలించడానికి నాలుగు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఏజెన్సీ తరఫున నిర్వహించే ఈ వాహనాలకు నెలకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు బిల్లులైతే చెల్లిస్తున్నారు. అయినా ఇక్కడ ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకుల హవానే నడుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మూడు మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో ఎంఎం వార్డు, అత్యవసర విభాగం నుంచి మృతదేహాలను తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్స్‌లను బాధితులు ఆశ్రయించాల్సి వచ్చింది.


మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఖాళీగా ఉన్న మూడు మహాప్రస్థానం వాహనాలు



అదే సమయంలో మృతదేహాలను తీసుకెళ్లడానికి ఎంఎం వార్డు, అత్యవసర విభాగం ముందున్న ప్రైవేటు అంబులెన్సులు


మార్చురీ వద్ద చిత్తు కాగితంపై రాసి అతికించిన మహాప్రస్థానం వాహన వివరాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు

కమీషన్ల కోసమేనా?

ఆస్పత్రిలో రోజూ చికిత్స పొందుతూ ఏడు నుంచి తొమ్మిది మంది మృతి చెందుతుంటారు. ఇలా చనిపోయిన వారి వివరాలను వార్డులోని స్టాఫ్‌నర్సు, డాక్టరు వెంటనే మహాప్రస్థానం నిర్వాహకులకు తెలియజేయాలి. అలాగే ఉచితంగా మృతదేహాలను తీసుకెళ్లడానికి మహాప్రస్థానం వాహనాలు ఉన్నట్లు బాధితులకు తెలిసేలా బోర్డులు పెట్టాలి. అటువంటివేమీ ఇక్కడ కనిపించవు. మహాప్రస్థానం వాహనాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు వంటివి ఎక్కడన్నా చిన్నపాటి కాగితంపై చేతితో రాసి ఉంచుతున్నారు. ఎవరన్నా గుర్తించి అడిగితే వాహనాలు దూరంలో ఉన్నాయని, వచ్చేందుకు సమయం పడుతుందని అక్కడున్న సిబ్బంది చెబుతారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లను రప్పించి, బాధితులకు సాయం చేస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. దీనికంతటికీ కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారులతోపాటు మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులకు కూడా కమీషన్లు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

సమ్మె వరకే చూసుకోండి....

చెత్త ట్రాక్టర్‌ను ఎలా అడ్డుకుంటారు?

● పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదం


పారిశుధ్య కార్మికులతో, సీఐటీయూ నాయకులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదం

నాయుడుపేట టౌన్, జనవరి 2 : సమ్మె చేసుకుంటున్నారు.. సమ్మె వరకే చూసుకోండి...అంతే కానీ చెత్త ట్రాక్టర్‌ను ఎలా అడ్డుకుంటారు... అంటూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పారిశుధ్య కార్మికులతో, సీఐటీయు నాయకులతో వాగ్వాదానికి దిగారు.నాయుడుపేటలో 8 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో చెత్త ఎక్కడికక్కడ నిల్వ చేరింది. దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు వేరే కార్మికుల చేత చెత్తను ట్రాక్టర్ ద్వారా మంగళవారం తరలించే ప్రయత్నాలు చేపట్టారు.ఈ సమాచారం తెలుసుకున్న సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు, వారి మద్దతుదారులైన సీఐటీయు నాయకులు అక్కడకు చేరుకొని చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య కారు దిగి ఏం జరుగుతోందంటూ ఆరా తీశారు. చెత్త ట్రాక్టర్‌ను మున్సిపల్ కార్మికులు అడ్డుకుంటున్నారని అధికారులు తెలిపారు. దీంతో చెత్త ట్రాక్టర్‌తో మీకేమిటి సంబంధం? మీ సమ్మె మీరు చేసుకోండంటూ పారిశుధ్య కార్మికులతో, సీఐటీయు నాయకులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదానికి దిగారు. జగన్ పాదయాత్ర సమయంలో తాను అధికారం చేపట్టిన వెంటనే పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు సమాన పనికి సమానవేతనం ఇస్తానని వాగ్దానం ఇచ్చారు సార్... అయితే నాలుగున్నర సంవత్సరాలైనా తమకేం న్యాయం చేయలేదు కాబట్టే సమ్మె చేస్తున్నాం. చెత్తను వేరే కార్మికుల చేత తరలిస్తే ఒప్పుకోం.న్యాయం చేయండని కోరారు.చివరకు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

సైకంకు సన్మానం



తిరుపతి రూరల్, జనవరి 2: సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.మోహన్, రంగయ్య, శివ, యోగానందరెడ్డి, మునిశేఖర్, బాబురెడ్డి, రాజారెడ్డి, రాజేష్ యాదవ్, ధన, సుబ్రహ్మణ్యం, ఆచారి, బాలాజి, గౌతం, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ ఉద్యోగులకు ఎంఈవోల మద్దతు


మెడకు ఉరితాళ్లతో ఎస్ఎస్ ఉద్యోగుల నిరసన

తిరుపతి(విద్య), జనవరి 2: సమగ్ర శిక్ష (ఎస్ఎస్) కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం మెడకు ఉరితాళ్లు తగిలించుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ వీరు చేస్తున్న సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, సకాలంలో జీతాలు ఇవ్వాలని కోరారు. వీరికి పలువురు ఎంఈవోలు మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపడతామని ఉద్యోగులు తెలిపారు. కాగా, జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నారు.

జీఎస్ఎల్వీ ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు

షార్‌కు చేరిన ఇంధన వాహనాలు

సూళ్లూరుపేట, జనవరి 2: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ నెలలోనే మరో ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది.తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 26న జీఎస్ఎల్వీ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఈ రాకెట్‌లో ఉపయోగించే ద్రవ ఇంధనాన్ని తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి రెండు ప్రత్యేక వాహనాల్లో రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ మంగళవారం షార్‌కు తీసుకొచ్చారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై రాకెట్ అనుసంధాన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. రాకెట్ మూడు దశల అనుసంధాన పనుల పూర్తయిన తరువాత శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చి ప్రయోగానికి రెడీ చేస్తారు. ఈ నెల 26న జీఎస్ఎల్వీ రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిలో తొలి రోజు చేపట్టిన ఎక్స్‌పోశాట్ ఉపగ్రహ ప్రయోగ విజయంతో ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు మరో ప్రయోగానికి సిద్ధమయ్యారు.

షార్‌కు భద్రత నడుమ వస్తున్న ఇంధన వాహనాలు



బర్రెకు వినతిపత్రం సమర్పణ

అంగన్వాడీల వినూత్న నిరసన



తిరుపతి (రవాణా), జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడం లేదంటూ మంగళవారం ఓ బర్రెకు వినతిపత్రాన్ని సమర్పించి.. అంగన్వాడీలు వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రాజెక్టు కార్యదర్శి టి.నాగరాజమ్మ మాట్లాడుతూ.. 22 రోజులుగా సమ్మె చేస్తుంటే పట్టించుకోని సీఎం జగన్ రాష్ట్రంలోని సమస్యలను ఏం పరిష్కరిస్తారని ప్రశ్నించారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వీరికి టీటీడీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, టి.సుబ్రహ్మణ్యం, టీటీడీ కాంట్రాక్టు కార్మికులు రఘు, త్యాగరాజు, పార్థసారథి, బాలాజి, ఏకాంబరం, అంగన్వాడీలు ఎల్లమ్మ, సుజిత, గీత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

గోవిందధామం నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

తిరుపతి (రవాణా), జనవరి 2: కరకంబాడి రోడ్డులోని గోవిందధామంలో నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా మాగం హేమసుందర్, కార్యదర్శిగా లక్ష్మీదేవి, కోశాధికారిగా జీవన్‌కుమార్‌ను గోవిందధామంలోని సంకల్ప సిద్ధి మహాగణపతి ఆలయంలో పూర్వపు అధ్యక్షుడు ఆదం సుధాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా టీటీడీ విశ్రాంత ఉద్యోగిని ఆదిలక్ష్మి రూ.10వేలను గోవిందధామంకు విరాళంగా ప్రకటించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



పేర్ని నాని

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 2: రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ, క్యాలెండరును కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టర్ బంగ్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు గాజుల నాగేశ్వరరావు, భీమినేని మునికృష్ణనాయుడు, జగన్నాథం, దొరసామయ్య, వేణు, హరిప్రసాద్‌రెడ్డి, రమేష్‌నాయక్, విజయ్‌శేఖర్‌రెడ్డి, లక్ష్మీపతి, మనోహర్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ వీసీకి అభినందన



వీసీని అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 2: ఎస్వీయూ కొత్త వీసీగా నియమితులైన ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డిని భైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(ఎంబీఏ,ఎంసీఏ)కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఈసందర్భంగా వీసీకి శ్రీవారి డైరీ, క్యాలెండరు అందజేసి, సన్మానించారు. ఎంబీఏ హెడ్ పి.నిరంజన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై దుష్ప్రచారం తగదు: వైసీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 2: డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై పార్టీలోని అసంతృప్తి వర్గం దుష్ప్రచారం చేయడం తగదని వైసీపీ నాయకులు అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పెరుమాళ్లపల్లె, ఏకాంబరకుప్పం ఎంపీటీసీలు మురళిరెడ్డి, ఎంపీటీసీ రాధిక మీడియాతో మాట్లాడారు. నారాయణస్వామి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. అయితే పార్టీలోని కొంతమంది పెత్తందారులు దళితుడనే చిన్నచూపు చూస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు పురంధర్, విజయ్, శేఖర్‌రెడ్డి, పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 2: రాస్ ప్రధాన కార్యాలయంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన 125 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కెనరా బ్యాంక్ జనరల్ మేనేజరు రవివర్మ, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, బ్యాంక్ మేనేజరు నాగరాజరావు, శరవణ, ఉమాపతి, రియాజ్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

5న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 2: ఎస్వీయూలో ఈనెల 5వ తేదీన జాబ్ మేళా జరగనుంది. ఎంప్లాయిమెంట్ బ్యూరో ఈ కార్యక్రమం నిర్వహించనుంది. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా ఉన్న కార్యాలయంలో మేళా ప్రారంభం కానుంది. సమగ్ర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు కోరారు.

ఆరోగ్యశ్రీలో ఉద్యోగాలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2: ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టులో ఎనిమిది ఆరోగ్యమిత్ర, ఓ టీం లీడరు పోస్టుకు అవుట్ సోర్సింగ్ పద్ధతిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి తెలిపారు. ఎనిమిది ఆరోగ్యమిత్ర పోస్టులను రోస్టర్ ప్రకారం ఓసీ -4(జనరల్), బీసీ-ఏ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, బీసీ-బీ కింద ఒక్కో పోస్టు కేటాయించారు. అర్హులైనవారు ఈనెల ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులను జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యాలయం, ఓల్డ్ మెటర్నిటీ ఆస్పత్రి భవనం, అలిపిరి రోడ్, తిరుపతికి పంపాలన్నారు. వివరాలకు 92810 68155 నెంబరును ఫోన్ చేయాలని సూచించారు.

నడివీధి గంగమ్మకు మొక్కులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 2: నగరంలోని 37వ డివిజన్ గిరిపురం నడివీధి గంగమ్మ, వినాయకస్వామిని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో మాట్లాడారు. జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌యాదవ్, కార్యదర్శి బాటసారి, పార్థు, నాయకులు చందు, కిరణ్‌కుమార్, రవి, బాలాజి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్లు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 63,358 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 19,534 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

రేపు అంధుల దినోత్సవం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 2: ఎల్‌ఐసీ రోడ్డులోని బాలాజీకాలనీ ఏపీఎన్జీవోహోమ్‌లో అంధుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతీయ అంధుల సమాఖ్య కోఆర్డినేటర్ విజయ్‌శేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 99664 37343, 94406 50002 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.







నారాయణాద్రి ఆస్పత్రి వద్ద తిరుచానూరు వెళ్లే మార్గంలో.. - కాటన్‌మిల్లు వద్ద పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మార్గంలో.. - అంకుర ఆస్పత్రి వద్ద అనంత ఆళ్వార్ మార్గంలో..

సూచిక బోర్డులెక్కడ?



హీరో షోరూం వద్ద రాణి పరాంతక దేవి మార్గంలో..

తిరుపతి - రేణిగుంట మార్గం నుంచి తిరుచానూరు వైపు వెళ్లే రోడ్లకు ఎక్కడా సూచిక బోర్డులు లేవు. ఇటీవల కొత్తగా నగర పాలక సంస్థ నిర్మించిన మార్గాలకూ సూచిక బోర్డులు పెట్టలేదు. దీనివల్ల శ్రీవారి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువమంది రేణిగుంట వరకు వచ్చి.. తిరిగి తిరుచానూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఇకనైనా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. - తిరుపతి(తిలక్‌రోడ్)

అవకాశమిస్తే అండగా ఉంటా: పులివర్తి నాని



నానీని సన్మానిస్తున్న కిరణ్‌రాయల్ తదితరులు

తిరుపతి రూరల్, జనవరి 2: తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. అవిలాల గ్రామ పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. వైసీపీ పాలనలో ప్రతి ఇంట్లో, ప్రతి మనిషికీ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయాలని కోరారు. జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ మాట్లాడుతూ.. 2019లో ఓటమి పొందినా నిత్యం ప్రజల్లో ఉంటూ పులివర్తి నాని పోరాటం చేశారని గుర్తుచేశారు. నాని ఎమ్మెల్యే అయితే చంద్రగిరి చరిత్రను తిరగ రాస్తారని చెప్పారు. తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో వాహనం బోల్తా

తమిళనాడు భక్తులకు స్వల్పగాయాలు



తిరుమల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో మంగళవారం రాత్రి ఓ వాహనం బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన ఆరుగురు భక్తులు శ్రీవారి దర్శనం కోసం టీఎన్ 22 బీఈ 2526 నెంబరు గల బొలెరో వాహనంలో తిరుమలకు బయల్దేరారు. రెండో ఘాట్‌లోని హరిణి ప్రాంతం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కార్మికుడి మృతదేహానికి అంత్యక్రియలు



తిరుపతి (రవాణా), జనవరి 2: ఓ భవన నిర్మాణ కార్మికుడి మృతదేహానికి అఖిల భారతీయ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల మంచాలవీధిలో పాత భవనాన్ని కూల్చివేస్తుండగా ఇద్దరు కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో నరసింహులు అనే కూలీ ఉన్నాడు. ఈయన సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలముంతల సుబ్బుయాదవ్ తెలిపారు.

ఏబీ బర్ధన్‌కు నివాళి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 2: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బైరాగిపట్టెడ గంధమనేని శివయ్య భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, విశ్వనాథం, శివ, కె.వై.రాజా, ఎన్.డి.రవి, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, కాలయ్య, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి-పెనగలూరు మధ్య పల్లెవెలుగు పునరుద్ధరణ

తిరుపతి(కొర్లగుంట), జనవరి 2: తిరుపతి-పెనగలూరుల మధ్య ఆర్టీసీ పల్లెవెలుగు సర్వీసును పునరుద్ధరించారు. సాంకేతిక కారణాలతో ఈ బస్సు మూడు నెలల కిందట ఆగిపోయింది. ఈ విషయం ప్రజాప్రతినిదుల దృష్టికి వెళ్లడంతో పునరుద్ధరించాలని కోరారు. ఈ నేపథ్యంలో అద్దె బస్సు అందుబాటులోకి రావడంతో తిరుపతిడిపో మేనేజర్ బాలాజి ఈ సర్వీసును మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు పునరుద్ధరించారు. తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట, పెనగలూరుకు వెళ్లి, అదే రూట్‌లో నగరానికి చేరుకునేలా రూట్ మ్యాప్ ఖరారు చేశారు. సీబీఎస్‌లోని 34ప్లాట్‌ఫామ్ నుంచి రోజూ ఉదయం 8గంటలకు, మధ్యాహ్నం 3గంటలకు రెండు ట్రిప్పులు నడపనున్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్వీయూ వీసీ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 2: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి కలిశారు. వీసీగా బాధ్యతలు తీసుకున్నాక తొలిసారిగా మంగళవారం విజయవాడలో గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని గవర్నర్ చెప్పినట్లు వీసీ తెలిపారు.

ఉచిత పథకాలొద్దు.. బ్యాంకు రుణాలివ్వండి

దళిత సంక్షేమ సేవా సంఘం



తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 2: ఉచిత పథకాలొద్దు.. బ్యాంకు రుణాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఉచిత పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీల జీవితాల్లో మార్పు వస్తుందా అని ప్రశ్నించారు. బలహీనతలను ఆసరా చేసుకుని ఆర్థికంగా ఎదగనివ్వకుండా మోసం చేస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. తమ పది డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 7వ తేదీన ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి శ్రీనివాస ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. చంద్ర తదితరులు పాల్గొన్నారు.


అప్పుడు సునీల్.. ఇప్పుడు ఎంఎస్ బాబు

● వైసీపీలో దళిత ఎమ్మెల్యేలే టార్గెట్

జిల్లా వైసీపీ ఎమ్మెల్యేల్లో తొలి తిరుగుబాటు జెండా ఎగిరింది. అణచిపెట్టుకున్న అవమానం దుఃఖాగ్రహంగా మారి కట్టలు తెంచుకుంది. ఐదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన సేవలన్నీ తాడేపల్లి ప్యాలెస్ తీసుకున్న నిర్ణయం ముందు బదాబదలయ్యాయి. ఐప్యాక్ టీం వేసిన తూకంలో నీళ్ల కన్నా పలచన అయిపోయానంటూ పూతలపట్టు దళిత ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం ప్రకటించిన ఆవేదన ప్రజల్లో చర్చగా మారింది. నా ఎస్టీలు.. నా ఎస్సీలు.. నా బీసీలు.. నా మైనారిటీలు.. అంటూ సభల్లో హోరెత్తే మాటల వెనుక ఉన్నది ఇదా అని దళిత, బీసీ, మైనారిటీ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పూతలపట్టు నుంచి ఎంఎస్ బాబుకు టికెట్ లేదని జగన్‌రెడ్డి తేల్చేయడంతో ఆయన మంగళవారం మీడియా ముందు కడుపుచించుకున్నారు. తన బాధ పంచుకున్నారు. వైసీపీ అధిష్ఠానానికి అనేక ప్రశ్నలు సంధించారు. అయితే 2019 ఎన్నికల సమయంలోనూ పూతలపట్టు విషయంలో జగన్ ఇదే తీరులో నిర్ణయం తీసుకున్న విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. పదవిలో ఉన్నా దళితులకు వైసీపీలో పవర్ ఉండదని అంటున్నారు. మండల స్థాయిలో కూడా ఒక సామాజికవర్గం నాయకులకు అణిగిమణిగి ఉండాల్సి వస్తోందని అంటున్నారు. ఇన్ని భరించినా మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి టికెట్ లేదంటూ తూచ్ అనేయడం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు వైసీపీలోని దళితవర్గాల నుంచి వినిపిస్తోంది.



ఎంఎస్ బాబు ఆవేదన

"ఈ ఐదేళ్ల పాటు పార్టీ పెద్దలు, మంత్రులు చెప్పినట్లు నడుచుకున్నా. ఇప్పుడు వ్యతిరేకత ఉందంటే బాధ్యత ఎవరిది? వ్యాపారాలను, కుటుంబాన్ని వదిలేసి కష్టపడితే ఇదా ఫలితం? నేనేం పాపం చేశాను. దళితుడిగా పుట్టడమే పాపమా?"

"మాటిమాటికి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటారే గానీ, మాకేం న్యాయం చేస్తున్నారు? రెడ్లు చెప్పిందే నేను చేశాను. సీఎం గారూ.. దళితులను మోసం చేయొద్దు."

"చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వ్యతిరేకత ఉన్నా ఓసీలకు మళ్లీ టికెట్లు ఇస్తున్నారు. డబ్బులిస్తే ఇష్టమొచ్చినట్లు ఐప్యాక్ సర్వే ఫలితాలను మారుస్తుంది. మరి వ్యతిరేకత వచ్చిందంటూ దళితులనే మార్చడమేంటో నాకు అర్థం కావడం లేదు."

జగన్ ఇంటి గేటు వద్ద రోజంతా పడిగాపులు కాసినా..



2019 ఎన్నికల సందర్భంగా జగన్ ఇంటి వద్ద వేచి ఉన్న నాటి ఎమ్మెల్యే సునీల్

2014 ఎన్నికల్లో పూతలపట్టు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సునీల్‌కుమార్‌ను 2019 ఎన్నికల సమయంలో వైసీపీ అధిష్ఠానం ఘోరంగా అవమానించింది. పిలిపించి టికెట్ లేదని గౌరవంగా కూడా చెప్పలేదు. అప్పట్లో టికెట్ మళ్లీ తనకే ఇవ్వమంటూ అడిగేందుకు లోటస్‌పాండ్‌లోని జగన్ ఇంటికి వెళ్లిన సునీల్‌కుమార్‌ను కనీసం ఇంట్లోకి కూడా రానివ్వలేదు. జగన్ ఇంటి గేటు వద్ద కుటుంబ సభ్యులతో కలిసి సునీల్‌కుమార్ రోజంతా నిలబడిన ఫొటోలు, వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి.

ఎంత తలొగ్గినా...



సునీల్‌కుమార్

సునీల్‌కుమార్‌కు టికెట్ ఇవ్వకపోవడం వెనుక జిల్లాను తన గుప్పెట్లో పెట్టుకున్న పెద్దనాయకుడి పాత్ర ఉందని అప్పట్లో ప్రచారం జరిగింది. అప్పట్లో సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్ బాబుకు టికెట్ ఇప్పించిన ఆ పెద్దాయనే ఇప్పుడు బాబుకూ ఎసరు పెట్టారని అంటున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఈ ఐదేళ్ల పాటు స్వతంత్రంగా పని చేయలేకపోయారనేది బహిరంగ సత్యం. ప్రతి విషయంలోనూ పార్టీ పెద్దలు, మంత్రులు జోక్యం చేసుకునేవారు. ఆయన కూడా ధిక్కారంగా ఎన్నడూ వ్యవహరించేవారు కాదు. యాదమరి, తవణంపల్లె, బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు మండలాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులే పెత్తనం చెలాయించారు. వార్డు మెంబర్ నుంచి జడ్పీటీసీ వరకు ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా తాము సూచించిన వారికి పదవులు దక్కేలా చూసుకున్నారు. ఎమ్మెల్యే వద్దన్నచోట ఇండిపెండెంట్లను రంగంలోకి దింపి గెలిపించుకున్నారు. కాణిపాకం ట్రస్టు బోర్డు ఛైర్మన్, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంటి పదవుల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే ఉన్నారు. బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ జడ్పీటీసీ మనోహర్ భార్య సెల్వికి ఎమ్మెల్యే సిఫార్సు చేసినా, పట్టించుకోని అధిష్ఠానం పరమేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. ఐరాల మండలంలో ఓ ఎంపీటీసీ స్థానానికి ఎమ్మెల్యే బీఫాం ఇచ్చిన వ్యక్తిని కాదని అక్కడ కూడా ఇండిపెండెంట్ అభ్యర్థిని నిలబెట్టి రూ.లక్షలు ఖర్చు పెట్టి గెలిపించుకున్నారు. యాదమరిలో ఓ తహసీల్దార్‌ను ఎమ్మెల్యే బదిలీ చేయిస్తే, మండలంలో ప్రాబల్యం ఉన్న ఓ నేత అదే తహసీల్దార్‌ను సాయంత్రానికి తెచ్చుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రతి మండలానికో రెడ్డి నాయకుడు పెత్తనం చెలాయిస్తూ, ఆయా మండలాల్లో ఎమ్మెల్యే మాట చెల్లకుండా డమ్మీగా చిత్రీకరించారు. అయినా ఎన్నికలు వచ్చాక నింద ఎంఎస్ బాబు మీద మోపేసి టికెట్ ఎగ్గొట్టడం విశేషం.

అసలేం జరిగింది?

2019లో ఎమ్మెల్యేగా గెలిచాక ఇప్పటిదాకా ఒక్కసారి కూడా సీఎం జగన్‌ను నేరుగా కలిసి మాట్లాడే అవకాశం ఎంఎస్ బాబుకు లభించలేదు. కాణిపాకంలో బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రం ఓసారి కొందరితో కలిసి వెళ్లి ఆయన సీఎంని కలిశారు. నియోజకవర్గ పరిస్థితుల్ని చెప్పుకునేందుకు అనేకసార్లు సీఎం అపాయింట్‌మెంట్ కోరినా ఫలితం లేదని ఎంఎస్ బాబు చెప్పారు. విచిత్రం ఏమిటంటే.. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని చెప్పడానికి మాత్రం సీఎంవో నుంచి



పిలుపు వచ్చింది. సుమారు వారం కిందట ఎంఎస్ బాబుతో సీఎం జగన్ నేరుగా భేటీ అయ్యారు. 'ఈసారి నీకు టికెట్ ఇవ్వడం కుదరడం లేదు. సర్వేల్లో నీ గురించి వ్యతిరేకంగా వచ్చింది. మనం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తాం' అని చెప్పినట్టు తెలుస్తోంది. అయినా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో సీఎం మనసు మార్చుకోవచ్చని ఆయన నమ్మినట్టు చెబుతున్నారు. అయితే సోమవారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి కూడా ఈసారి టికెట్ లేదనే విషయాన్ని బాబుకు తేల్చి చెప్పేశారని, దీంతో మదనపడ్డ ఆయన మంగళవారం మీడియా ముందు మనసులో ఉన్నదంతా బయటపెట్టేశారని తెలుస్తోంది.

9న వెంకటగిరికి చంద్రబాబు రాక



సభకు స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 2: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీ వెంకటగిరికి రానున్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించనున్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, టీడీపీ నాయకులు నరసింహయాదవ్, కొండేపి గంగాప్రసాద్, పాశం సునీల్‌కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం, హేమలత, జన్నిరమణయ్య, జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు తదితరులు బహిరంగ సభ, హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. పట్టణ పరిధిలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం, తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో ఉన్న మరో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంటు పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలని సూచించారు.

సమ్మె వరకే చూసుకోండి.... చెత్త ట్రాక్టర్‌ను ఎలా అడ్డుకుంటారు?

పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదం



పారిశుధ్య కార్మికులతో, సీఐటీయూ నేతలతో ఎమ్మెల్యే వాగ్వాదం

నాయుడుపేట టౌన్, జనవరి 2: సమ్మె చేసుకుంటున్నారు.. సమ్మె వరకే చూసుకోండి...అంతే కానీ చెత్త ట్రాక్టర్‌ను ఎలా అడ్డుకుంటారు... అంటూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పారిశుధ్య కార్మికులతో, సీఐటీయు నాయకులతో వాగ్వాదానికి దిగారు.నాయుడుపేటలో 8 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో చెత్త ఎక్కడికక్కడ నిల్వ చేరింది.దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు వేరే కార్మికుల చేత చెత్తను ట్రాక్టర్ ద్వారా మంగళవారం తరలించే ప్రయత్నాలు చేపట్టారు.ఈ సమాచారం తెలుసుకున్న సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు, వారి మద్దతుదారులైన సీఐటీయు నాయకులు అక్కడకు చేరుకొని చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య కారు దిగి ఏం జరుగుతోందంటూ ఆరా తీశారు. చెత్త ట్రాక్టర్‌ను మున్సిపల్ కార్మికులు అడ్డుకుంటున్నారని అధికారులు తెలిపారు. దీంతో చెత్త ట్రాక్టర్‌తో మీకేమిటి సంబంధం? మీ సమ్మె మీరు చేసుకోండంటూ పారిశుధ్య కార్మికులతో, సీఐటీయు నాయకులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదానికి దిగారు. జగన్ పాదయాత్ర సమయంలో తాను అధికారం చేపట్టిన వెంటనే పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు సమాన పనికి సమానవేతనం ఇస్తానని వాగ్దానం ఇచ్చారు సార్... అయితే నాలుగున్నరేళ్లయినా తమకేం న్యాయం చేయలేదు కాబట్టే సమ్మె చేస్తున్నాం. చెత్తను వేరే కార్మికుల చేత తరలిస్తే ఒప్పుకోం.న్యాయం చేయండని కోరారు. చివరకు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది.

ప్రైవేటు అంబులెన్స్‌లదే హవా

రుయాలో మహాప్రస్థానం వాహనాలుండీ ఉపయోగమేమి?



మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఖాళీగా ఉన్న మూడు మహాప్రస్థానం వాహనాలు


తిరుపతి సిటీ, జనవరి 2: రుయాస్పత్రిలో మృతదేహాలను ఉచితంగా తరలించడానికి నాలుగు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఏజెన్సీ తరఫున నిర్వహించే ఈ వాహనాలకు నెలకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు బిల్లులైతే చెల్లిస్తున్నారు. అయినా ఇక్కడ ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకుల హవానే నడుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మూడు మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో ఎంఎం వార్డు, అత్యవసర విభాగం నుంచి మృతదేహాలను తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్స్‌లను బాధితులు ఆశ్రయించాల్సి వచ్చింది.

కమీషన్ల కోసమేనా?

ఆస్పత్రిలో రోజూ చికిత్స పొందుతూ ఏడు నుంచి తొమ్మిది మంది మృతి చెందుతుంటారు. ఇలా చనిపోయిన వారి వివరాలను వార్డులోని స్టాఫ్‌నర్సు, డాక్టరు వెంటనే మహాప్రస్థానం నిర్వాహకులకు తెలియజేయాలి. అలాగే ఉచితంగా మృతదేహాలను తీసుకెళ్లడానికి మహాప్రస్థానం వాహనాలు ఉన్నట్లు బాధితులకు తెలిసేలా బోర్డులు పెట్టాలి. అటువంటివేమీ ఇక్కడ కనిపించవు. మహాప్రస్థానం వాహనాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు వంటివి ఎక్కడన్నా చిన్నపాటి కాగితంపై చేతితో రాసి ఉంచుతున్నారు. ఎవరన్నా గుర్తించి అడిగితే వాహనాలు దూరంలో ఉన్నాయని, వచ్చేందుకు సమయం పడుతుందని అక్కడున్న సిబ్బంది చెబుతారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లను రప్పించి, బాధితులకు సాయం చేస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. దీనికంతటికీ కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారులతోపాటు మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులకు కమీషన్లు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.







అదే సమయంలో మృతదేహాలను తీసుకెళ్లడానికి ఎంఎం వార్డు, అత్యవసర విభాగం ముందున్న ప్రైవేటు అంబులెన్సులు - మార్చురీ వద్ద చిత్తు కాగితంపై రాసి అతికించిన మహాప్రస్థానం వాహన వివరాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు

ఆరోగ్యశ్రీలో ఉద్యోగాలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2: ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టులో ఎనిమిది ఆరోగ్యమిత్ర, ఓ టీం లీడరు పోస్టుకు అవుట్ సోర్సింగ్ పద్ధతిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి తెలిపారు. ఎనిమిది ఆరోగ్యమిత్ర పోస్టులను రోస్టర్ ప్రకారం ఓసీ-4(జనరల్), బీసీ-ఏ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, బీసీ-బీ కింద ఒక్కో పోస్టు కేటాయించారు. అర్హులైనవారు ఈనెల ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులను జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యాలయం, ఓల్డ్ మెటర్నిటీ ఆస్పత్రి భవనం, అలిపిరి రోడ్, తిరుపతికి పంపాలన్నారు. వివరాలకు 92810 68155 నెంబరును ఫోన్ చేయాలని సూచించారు.

జీఎస్ఎల్వీ ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు

షార్‌కు చేరిన ఇంధన వాహనాలు



షార్‌కు భద్రత నడుమ వస్తున్న ఇంధన వాహనాలు

సూళ్లూరుపేట, జనవరి 2: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ నెలలోనే మరో ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 26న జీఎస్ఎల్వీ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఈ రాకెట్‌లో ఉపయోగించే ద్రవ ఇంధనాన్ని తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి రెండు ప్రత్యేక వాహనాల్లో రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ మంగళవారం షార్‌కు తీసుకొచ్చారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై రాకెట్ అనుసంధాన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. రాకెట్ మూడు దశల అనుసంధాన పనుల పూర్తయిన తరువాత శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చి ప్రయోగానికి రెడీ చేస్తారు. ఈ నెల 26న జీఎస్ఎల్వీ రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిలో తొలి రోజు చేపట్టిన ఎక్స్‌పోశాట్ ఉపగ్రహ ప్రయోగ విజయంతో ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు మరో ప్రయోగానికి సిద్ధమయ్యారు.

సమ్మెను విజయవంతం చేద్దాం: ఏఐటీయూసీ



కార్మికులతో చర్చిస్తున్న ఏఐటీయూసీ నాయకుడు మహేష్

పుత్తూరు అర్బన్, జనవరి 2: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెను విజయవంతం చేద్దామని ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు డి.మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తానని గత ఎన్నికల సందర్భంగా సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కుట్టుకూలీ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు, మట్టి ఖర్చుల బకాయిలు, కోవిడ్‌లో పనిచేసిన కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, నెలకు రూ.26 వేల వేతనం డిమాండ్లను సైతం నెరవేర్చాలని కోరారు. వీటిపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతోనే సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మెలో ప్రతి కార్మికుడూ పాల్గొనాలని సూచించారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు యాకోబు, అంకయ్య, ప్రభాకర్, కుమార్, మనెమ్మ, రమా, వజ్రాలు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

జాతీయ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో విద్యార్థులకు కాంస్య పథకాలు

వడమాలపేట, జనవరి 2: జాతీయ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కాంస్య పథకాలు సాధించారు. విశాఖపట్నంలోని రామకృష్ణ బీచ్ వేదికగా జరిగిన జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో యువకిశోర్, విశాల్ ప్రతిభ చూపారు. 8వ తరగతి విద్యార్థులు యువకిషోర్ 52 కిలోల విభాగంలో, విశాల్ 57 కిలోల విభాగంలో కాంస్య పతకాలు సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు తెలిపారు.



కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులు

అంగన్వాడీల ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: సీఐటీయూ



దున్నపోతుకు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పుత్తూరు అర్బన్, జనవరి 2: అంగన్వాడీల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ స్పష్టం చేశారు. మంగళవారం అంగన్వాడీల సమ్మెలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద దున్నపోతుకు వినతిపత్రం సమర్పించి ప్రభుత్వానికి తమ నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతోనే చివరి అస్త్రంగా సమ్మె చేస్తున్నట్లు వివరించారు. అయితే చర్చలకు పిలిచిన ప్రభుత్వ పెద్దలు ఏ ఒక్క డిమాండ్ పట్ల సానుకూలంగా స్పందించకపోగా బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. స్థానికంగా అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ, అధికార యంత్రాంగం నుంచి బెదిరింపులు వస్తున్నాయని, వీటిని ఖాతరు చేయకుండా సమ్మె కొనసాగించి తీరుతామని ఆయన తేల్చి చెప్పారు. రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపామని వివరించారు. ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకుంటే అన్ని రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజలను కలుపుకుని ఆందోళనలను ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునికుమారి, విజయకుమారి, కృష్ణవేణి, ధనమ్మ, రాధా, పద్మజ, హైమావతి, ప్రమీల, అన్నపూర్ణ, లలిత, గంగులమ్మ, అరుణ, సీఐటీయూ నాయకులు పురుషోత్తం, విజయ్, రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ మండల కమిటీ నియామకం

పుత్తూరు, జనవరి 2: వైసీపీ పుత్తూరు మండల కమిటీని నియమించినట్లు మంత్రి రోజా తెలిపారు. అధ్యక్షుడుగా గోవిందస్వామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా షణ్ముగం, మునిరాజా, ప్రధాన కార్యదర్శులుగా బాబు, జయకుమార్, శివ, దాము, కార్యదర్శులుగా బలరామిరెడ్డి, నాని, రాజరత్నం, సుదర్శనం, వినోద్, కుమార్‌రాజు, ఈశ్వరరెడ్డి, రాజేంద్రతో పాటు ఎనిమిది మంది సహాయ కార్యదర్శులుగా నియమితులయ్యారని పేర్కొన్నారు.



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సముదాయంలో ఆరోగ్య సురక్ష

నారాయణవనం, జనవరి 2: సముదాయం సచివాలయ పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి నుంచి వచ్చిన గైనాకలాజిస్ట్, జనరల్ ఫిజీషియన్‌తో పాటు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు దర్శిత్ రాజ్, రాఘసుధ, అరవింద్ ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, సర్పంచులు, పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి జనవరి 2: వైసీపీ ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవడంలేదని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పంటలు దెబ్బతిన్న ప్రతీ ఎకరాకు రూ.30వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.చక్కెర కర్మాగారాల నుంచి రైతులకు రావాల్సిన బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.పరిశ్రమ నిర్వాహకులకు కొమ్ముకాస్తూ రైతులను దారుణంగా దగా చేస్తోందన్నారు. ఎస్ఎస్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.జిల్లా అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి హేమలత తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్

శ్రీకాళహస్తి జనవరి 2: శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం నుంచి ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు విక్రం స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దక్షిణ కైలాస నగర్ కాలనీలోని మైదానంలో ఈనెల 3నుంచి 9వరకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు విభాగాల వయోపరిమితితో సింగిల్స్, డబుల్స్ పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు.

స్థానిక కళాకారులకు ప్రాధాన్యమివ్వండి

శ్రీకాళహస్తి జనవరి 2: స్థానిక కోలాట కళాకారుల బృందాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ఉత్సవాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ సంస్థ జిల్లా కార్యదర్శి తాలేటి రామచంద్రయ్య కోరారు. ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులును మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు.

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకార ఉత్సవం.

శ్రీకాళహస్తి, జనవరి 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవస్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం మీదుగా విజయ స్థూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

శ్రీకాళహస్తి జనవరి 2: గుర్తు తెలియని వృద్ధుడి(65) మృతదేహం స్వర్ణముఖి నదిలో మంగళవారం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి పట్టణం రామసేతు వంతెన సమీపంలోని పాత జయరాం రావు పార్కు వద్ద నదిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు.వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్ఐ మణి కోరారు.

గోవర్ధనపురంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు

వరదయ్యపాళెం, జనవరి 2: వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లి సచివాలయ పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. గోవర్ధనపురం జడ్పీ హైస్కూల్ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. సర్పంచులు మల్లంగ్ అబ్దుల్ మజీద్, చల్ల వీరభద్రయ్య, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు,ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, ఎంపీటీసీ ప్రసాద్, చిన్న పాల్గొన్నారు.

మహిళలకు క్రికెట్ పోటీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీలో మహిళలకు పీడీలు కిషోర్‌కుమార్, మస్తాన్ మంగళవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు.

సచివాలయంలో చోరీ యత్నం

నాగలాపురం, జనవరి 2: నాగలాపురం మండల పరిధిలోని కృష్ణాపురం సచివాలయంలో సోమవారం రాత్రి చోరీకి ప్రయత్నించారు.కార్యదర్శి అబ్దుల్ షేక్ కథనం మేరకు .. దుండగులు సోమవారం రాత్రి సచివాలయం వెనుక వైపున్న ఇనుప తలుపు తాళాలు పగుల గొట్టి కార్యాలయంలోకి చొరబడ్డారు. బీరువా తలుపులను పగులగొట్టి రికార్డులు తప్ప వేరేవీ లేకపోవడంతో వెళ్లిపోయారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ఏర్పేడు, జనవరి 2: ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలో పుష్పిత్ స్టీల్స్ వద్ద మంగళవారం రోడ్డు దాటుతుండగా సుమో ఢీకొనడంతో కూనాటి నరేంద్ర అలియాస్ నరేష్(28) గాయపడ్డాడు.తలకు తీవ్రగాయాలవడంతో స్థానికులు స్పందించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ను వివరాలు అడిగి తెలుసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

మధ్యాహ్న భోజనంలో శుభ్రతేదీ?


చేతికి గ్లౌజులు లేకుండా అన్నం కలుపుతున్న ఆయాలు

వరదయ్యపాళెం, జనవరి 2: వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం తనిఖీ చేశారు. ఆహార తయారీలో కనీస పరిశుభ్రత పాటించకుండా తడి నేలపై సిల్క్‌చీరను పరిచి దానిపై అన్నం ఆరబోయడాన్ని గుర్తించారు. అదేవిధంగా చేతులకు గ్లౌజులు లేకుండా నిమ్మకాయ అన్నం కలపడం గుర్తించారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఇకనైనా పరిశుభ్ర వాతావరణంలో భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు వేలూరు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్యదర్శి సిద్ధులయ్య, మండల ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, పసుపులేటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ అవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) కొత్త సంవత్సర డైరీని, క్యాలెండర్‌ను ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం మంగళవారం విద్యాశాఖ కార్యాలయంలో అవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యురాలు దీపిక, గౌరవాధ్యక్షుడు రవీంద్రరెడ్డి,మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు. .

ఎస్టీయూ డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ

వరదయ్యపాళెం, జనవరి 2: వరదయ్యపాళెం మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఎంఈవో గున్నయ్య ఎస్టీయూ డైరీలను, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి, జిల్లా కార్యదర్శి చిన్నయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి చెంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించండి

కేవీబీపురం జనవరి 2 : మండలంలోని కాట్రపల్లిలో మంగళవారం వెటర్నరీ డాక్టర్ ప్రసాద్ అధ్వర్యంలో పశువులకు పరీక్షలు చేసి మందులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి(అమ్మతల్లి) సోకకుండా టీకాలను ప్రతి పశువుకూ వేయించాలని సూచించారు.

దున్నపోతుకు అంగన్వాడీల వినతిపత్రం



సత్యవేడు, జనవరి 2: సత్యవేడులో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారం కావాలని దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చారు.సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, శాంతి, ఇందిర, ఝాన్సీ, భారతి, కాంతమ్మ, సుభాషిణి, దివ్య, గౌరి, మంజుల, అనూష, అనిల, భువన, రజని, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ సందర్శనకు ఆహ్వానం

శ్రీసిటీ, జనవరి 2: పీఎస్ఎల్‌వీ సీ-58 రాకెట్ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌తో పాటు షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్‌కు, షార్ శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు మంగళవారం శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ అద్భుత ఘట్టాన్ని షార్ మిషన్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చుని వీక్షించిన ఆయన, అంతరిక్ష సాంకేతికతలో అగ్రగ్రామిగా భారతదేశం స్థానాన్ని సుస్థిరం చేస్తూ ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషి, అంకితభావాన్ని కొనియాడారు.

బెదిరింపులతో సమ్మె ఆగదు


సమ్మె చేస్తున్న అంగన్వాడీలు

శ్రీకాళహస్తి జనవరి 2: బెదిరింపులతో అంగన్వాడీల సమ్మె ఆగదని ఐఎఫ్‌టీయూ ప్రాజెక్టు కార్యదర్శి స్వర్ణ హెచ్చరించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద మంగళవారం నిరవధిక సమ్మెలో భాగంగా రిలే దీక్ష చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ... చర్చల కోసం అంగన్వాడీలను పిలిచిన మంత్రులు బెదిరింపులకు పాల్పడడం బాధాకరమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరడంలో తప్పేంటని ప్రశ్నించారు.కల్పన, శోభ తదితరులు పాల్గొన్నారు.

జగన్ సర్కార్ అంతుచూడడం ఖాయం


పిచ్చాటూరులో అంగన్వాడీలతో ధర్నాలో పాల్గొన్న జేడీఆర్, టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, జనవరి 2: అంగన్వాడీలకు అల్టిమేటం ఇచ్చిన జగన్ సర్కారు అంతు చూడడం ఖాయమని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సమ్మె చేస్తున్న అంగన్వాడీ శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపిన ఆయన వారితో కలసి ధర్నా చేసిన ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంగన్వాడీలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. చంద్రబాబు సీఎం అయ్యాక సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని భరోసా కల్పించారు.

గుప్తనిధుల కోసమే ఆలయాల కూల్చివేత

ముక్కంటి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహం మాయం ● వైసీపీ నేతలపై సుధీర్ రెడ్డి ఫైర్


మీడియా సమావేశంలో సుధీర్ రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి జనవరి 2: గుప్త నిధుల కోసమే వైసీపీ నేతలు ఆలయాలను కూల్చి వేస్తున్నారని... ముక్కంటి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని మాయం చేశారని టీడీపీ ఇంచార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ సన్నిధి పక్కన ఉన్న గోడల కూల్చివేతపై మంగళవారం సుధీర్ రెడ్డి టీడీపీ నేతలతో కలిసి ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీకాళహస్తిలో వరదరాజస్వామి ఆలయం కూల్చివేసిన సమయంలోనే గుప్త నిధులను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే విక్రయిస్తున్నట్లు వెల్లడించానన్నారు.దీంతో తన మీద రూ.2 కోట్లకు పరువు నష్టం దావా వేశారని గుర్తు చేశారు. విజ్ఞానగిరి వద్ద వినాయక స్వామి ఆలయం, ఊరందూరులో నీలకంఠేశ్వరాలయం, ఏడు గంగమ్మ ఆలయాలను పునర్నిర్మాణాల పేరుతో కూల్చివేశారన్నారు. ఇవన్నీ గుప్త నిధుల కోసమే ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద గోడలు కూల్చివేసిన ప్రదేశంలో ఉన్న లక్ష్మీదేవి విగ్రహాన్ని మాయం చేశారని ఆరోపించారు.దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు రూ.200కోట్లకు పైగా నిధులు ముక్కంటి ఆలయానికి ఉన్నాయన్నారు. ప్రస్తుతం రూ.20కోట్లు ఉంచి మిగతాది స్వాహా చేసేయడం బాధాకరమన్నారు. పురాతన కట్టడాలు ఎందుకు కూల్చి వేస్తున్నారని ఈవో రామారావును అడిగితే హాస్యాస్పదంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. వారం రోజుల్లో ఆలయంలోని టికెట్ కౌంటర్లు, లడ్డు పోటు, అన్నదానం స్టోర్, ఇంజనీరింగ్ విభాగం, నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, గోశాలలో కుంభకోణం అన్ని అంశాలపై తిరుపతిలో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను బహిర్గతం చేస్తానన్నారు.ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలిలో రౌడీలకు స్థానం కల్పించడం సిగ్గుచేటన్నారు. మండలిలోని ఓ ప్రత్యేక ఆహ్వానితుడు సోమవారం రాత్రి ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనను ఇందుకు ఉదాహరణగా ఆయన చెప్పారు.

రాజకీయాల కోసం క్షేత్ర ప్రతిష్ట దెబ్బతీయొద్దు


సిమెంటు పెళ్లలు చూపుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి జనవరి 2: రాజకీయాల కోసం శ్రీకాళహస్తీశ్వరాలయ క్షేత్ర ప్రతిష్టను దెబ్బతీయడం భావ్యం కాదని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు.మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆలయంలోని నైవేద్యం పోటు పక్కన 1956లో సిమెంట్ కట్టడంతో స్టోర్ రూమ్ నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ వేద ఆశీర్వాద మండపం నిర్మించాలని రెండేళ్ల క్రితం తీర్మానించామని వివరించారు. 40 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని అనుబంధ ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 116 రామ మందిరాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. అయితే సుధీర్‌రెడ్డి ముక్కంటి ఆలయంలో పురాతన కట్టడాన్ని కూల్చివేశామని ప్రచారం చేయడం అన్యాయమన్నారు.

గ్రామ సభల ద్వారా ఎంపిక చేసిన పనులకే ప్రాధాన్యత

బుచ్చినాయుడుకండ్రిగ, 2: గ్రామ సభల ద్వారా ఎంపిక చేసిన పనులకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఇందిర తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ పంచాయతీ గ్రామ సభను సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో పంచాయతీలో చేపట్టవలసిన పనులకు సంబంధించి సభలో చర్చించడం జరిగిందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నమోదు చేయడం జరిగిందన్నారు.ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.